




ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న కందారపు మురళి

అడుగడుగునా జన నీరాజనం

ఉత్సహంగా యువగళం పాదయాత్ర



చిత్తూరు నగరంలో పాదయాత్రలో భారీగా పాల్గొన్న టిడిపి నాయకులు , కార్యకర్తలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
యువగళం.. మన గళం.. ప్రజాబలం.. అంటూ తెలుగుదేశం యువనేత నారా లోకేష్ పాదయాత్ర సాగింది. ఆంక్షలు అడ్డుకుంలను ఎదుర్కొని 11వ రోజు ఆదివారం సాయంత్రానికి చిత్తూరు చేరుకుంది. పది రోజుల పాటు 130.6కిలోమీటర్లు కుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, పూతలపట్టు నియోజవర్గాల్లో అడుగడుగునా నీరాంజనాలు పడుతున్న ప్రజల మధ్య నారా లోకేష్ పాదయాత్ర సాగింది. పాదయాత్ర 100కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా బంగారుపాళ్యం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేశారు. సోమవారం చిత్తూరు నియోజకవర్గం మంగసముద్రం నుండీ ఉదయం 8 గంటలకు పాదయాత్ర ప్రారంభమైంది. టిడిపి చిత్తూరు నియోజవర్గ అధ్యక్షురాలు కఠారి హేమలత, జిల్లా ఉపాధ్యక్షులు కాజూరు బాలాజి, జిల్లా నాయకులు అమరనాధరెడ్డి, దొరబాబు, యువనాయకులు వసంత్‌కుమార్ లోకేష్ వెంట నడిచారు. మంగసముద్రం బీడీ కాలనీలోని బీడీ కార్మికులతో నారాలోకేష్ ముఖాముఖి నిర్వహించి బీడీ కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు.



మహిళా కార్యకర్తలకు కరచాలనం చేస్తున్న లోకేష్

సంతపేటలో స్థానికులు, నాయకులు పాదయాత్ర బృందానికి భారీ స్వాగతం పలికారు. పాత జిల్లాకోర్టు వద్ద న్యాయవాదులు లోకేష్‌ను కలసి న్యాయవాదుల సమస్యలను వినవించారు. గాంధీ విగ్రహం వద్ద తెలుగుదేశం యువ నాయకులు వసంత్‌కుమార్ లోకేష్‌కు భారీ స్వాగతం పలికారు. ఎంఎస్ఆర్, గ్రీమ్స్‌పేట కూడళ్లల్లో యువగళం పాదయాత్రకు జనం భారీగా పాల్గొనడంతో ప్రజలను పలకరిస్తూ చిరునవ్వులతో నారా లోకేష్ పాదయాత్ర సాగింది. అంబేద్కర్ సర్కిల్ వద్ద ముస్లీం పెద్దలతో మాట్లాడి మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెసుకున్నారు. వేలూరు రోడ్డులోని అమర రాజా ప్రాంగణంలో మహిళతో ముఖాముఖి నిర్వహించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెసుకున్న నారాలోకేష్ మాట్లాడుతూ జగన్ రాక్షసపాలనలో మహిళలకు రక్షణ కరువైందని, హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న జగన్ పాలనకు చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. అమర రాజా ప్రాంగణంలో కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత మధ్యాహ్నం 2గంటలకు పాదయాత్ర పునఃప్రారంభించారు. గాంధీ విగ్రహం మీదుగా సాగిన పాదయాత్రలో టిఎన్ఎస్ఎఫ్ నేతృత్వంలో పిసిఆర్ సర్కిల్ వద్ద విద్యార్థులు స్వాగతం పలికారు. తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఫీటర్ నాయకత్వంలో ఎస్సీ సామాజికవర్గలతో నారాలోకేష్ బేటీ నిర్వహించి ఎస్సీల అభివృద్ధి కోసం తెలుగుదేశం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం నిర్వీయం చేయడంతో పాటు ఎస్సీ కార్పోరేషన్‌కు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం ఎస్సీలకు అభివృద్ధి కోసం రుణాల మంజూరు, వాహనాలను మంజురు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో దళిత, గిరిజనులు చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. అడుగుడునా ప్రజల నీరాంజనాలతో లోకేష్ యువగళం పాదయాత్ర చిత్తూరు నగరంలో సాగింది. నారా లోకేష్ పాదయాత్రను సాగే రహదారి వెంబడీ తెలుగుదేశం నాయకులు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అంగన్వాడీల గోడు పట్టించుకోండి

కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా



ప్రజాశక్తి- తిరుపతి టౌన్
దీర్ఘకాలికంగా అంగన్వాడీలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వేలాది మంది భారీ ధర్నాను నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 3.30గంటల పాటు తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలచే భారీ ధర్నా జరిగింది. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మలీల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, ఫేషియల్ యాప్ రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తక్షణం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తమ కోర్కెలు పరిష్కారించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే తెలంగాణా కంటే అధిక వేతనాలు ఇస్తామని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి ఇప్పుడు పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, భీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు, అంగన్వాడీలకు జాబ్ కేలెండర్లను నిర్ణయించాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. అంగన్వాడీలకు సంక్షేమపథకాలు అమలు చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం, ఆయిల్, కందిపప్పు కోటాను పెంచాలని విజ్ఞప్తి చేశారు. హెల్పర్లకు ప్రమోషన్ల విషయంలో వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు చెల్లించాలని, సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. వైయస్సార్ పోషణ మెనూ చార్జీలను పెంచాలని వారు కోరారు. వివిధ ప్రాజెక్టులకు చెందిన నేతలు ఇంద్రాణి, స్వరూపరాణి, ప్రభావతి, నాగరాజమ్మ, మునికుమారి, రాజేశ్వరి, నిర్మల పాల్గొన్నారు.

అంగన్వాడీల పోరాటానికి సిఐటియు మద్దతు...!
అంగన్వాడీలు కనీసవేతనాలు, గ్రాట్యూటీ సాధన కోసం చేపట్టిన పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు అంగన్వాడీల పట్ల బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ పనిభారాన్ని తీవ్రంగా పెంచాయని ఆ మేరకు వేతనాలు పెంచలేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కర్ణాటకరాష్ట్రంలో అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేస్తుండగా, ఈ రాష్ట్రంలో ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. అంగన్వాడీల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని, రాష్ట్రస్థాయి పోరాటానికి ప్రత్యక్ష మద్దతు ఇస్తామని ప్రకటించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, కెఎన్ఎన్.ప్రసాద్‌రావు, వి.నాగరాజు, ఆర్.లక్ష్మి, బాలాజీ, వేణు, రఘు, ఇఎస్.కుమార్, వెంకటేశు, రమేషు, నాగరాజు, మునిరాజా మద్దతు ప్రకటించారు.

బిఎస్ఎన్ఎల్ వారి ఐపి టివి సేవలు ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: బిఎస్ఎన్ఎల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని బిఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ వినియోగదారులకు వాయిస్, ఇంటర్నెట్ సేవలతో పాటు ఐపి టివి సర్వీసులు ప్రారంభించినట్లు ఐపి టివి సర్వీస్‌లను ఆసంస్థ జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సి.అమరేంద్రరెడ్డి తెలిపారు. ఈ సర్వీసులు బిఎస్ఎన్ఎల్ వారు తమ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వున్న తమ ఫ్రాంచైజీల ద్వారా అనీ గ్రామాలు, పట్టణాలలో ఉన్న ప్రస్తుత వినియోగదారులకు నూతనంగా ఫైబర్‌నెట్ తీసుకొనే వినియోగదారులకు ఇవ్వడానికి వీలు కలుగుతుందని అన్నారు. దీని వలన జిల్లా ప్రజలు బిఎస్ఎన్ఎల్ హైస్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు కేబల్ కనెక్షన్‌కి ప్రత్యామ్నాయంగా ఐపి టిడి సర్వీసులు బిఎస్ఎన్ఎల్ ద్వారా ద్వారా చాలా చవకైనా ధరలకు పొందవచ్చు అని తెలిపారు. ఐపి టివి సర్వీసులు అన్ని ప్రముఖ తెలుగు పేయిట్ ఛానల్స్ ఎస్‌డి, హెచ్‌డి టెక్నాలజీతో వివిధ ప్యాక్‌ల రూపంలో లభ్యమవుతుందన్నారు. ఎస్‌డి బేసిక్‌ప్యాక్ ధర రూ.239లు, హెచ్‌డి బేసిక్‌ప్యాక్ ధర రూ.279లతో లభ్యమవుతాయని అన్నారు. ఇంతే కాకుండా ఫైబర్ నెట్ సేవలు మరింత ప్రజల దగ్గర చేరుటకు బిఎస్ఎన్ఎల్ అతి తక్కువ ప్యాకేజీ ధరలతో నెలకు రూ.329ల నెలసరి అద్దెతో సరికొత్త ప్లాన్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ ప్లాన్ జిల్లాలోని అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు వర్తిస్తుందన్నారు.

భూ కబ్జాలను అరికట్టండి

ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వినతి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సోమవారం తిరుపతి అర్బన్ ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నేతల స్థలాన్ని వైసిపి కార్పొరేటర్ కబ్జాలకు ప్రయత్నిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. కోట్ల రూపాయలు విలువ చేసే సర్వే నెంబర్ 254/2, 254/3, 254/4, 254/5, 255/1, 256/1లోని భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో కక్ష సాధింపు చర్యలో భాగంగా 13వ వార్డు వైసిపి కార్పొరేటర్ ఆంజనేయులు, ఆయన అనుచరులు బాకామణిలు కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. దళితులను అడ్డం పెట్టుకుని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. 2004 సంవత్సరంలో స్థలాన్ని కొన్నామని, స్థలాన్ని గుణశేఖర్ నాయుడుకు లీజుకు ఇస్తే లీజుదారులను వైసిపి కార్యకర్తలు ఏ ఆధారాలు లేకుండా బెదిరిస్తున్నారని ఎస్పీ కంప్లైంట్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు చినబాబు, నాయకులు బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం



సమస్యపై పద్మమ్మతో మాట్లాడుతున్న జెసి బాలాజీ

ప్రజాశక్తి- తిరుచానూరు, తిరుపతి సిటీ: వారసత్వంగా వచ్చిన తమ భూమిలో దౌర్జన్యానికి పాల్పడుతున్నా వారిపై చర్యలు తీసుకోవాలని ఓ వృద్ధురాలు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆత్మహత్యానికి పాల్పడింది. శ్రీకాళహస్తికి చెందిన ఎన్.పద్మమ్మ (68)కు పానగల్ సర్వేనెంబర్ 202/7లో 1.56 ఎకరాల భూమి ఆమె పిన తండ్రి ఆర్.మురుగేషన్ మొదలి పేరుతో ఉంది. ఆమె తండ్రి రామంజేరి ఏలుమలై మరణానంతరం 2002లో ఆభూమిని బాగా పరిష్కారం చేసుకున్నారు. అందులో సగభాగం ఆర్.మురుగేషన్ మొదలి కుమారులకు మిగతా సగభాగం రామంజరి, కాంతం పిల్లలకు భాగపరిష్కారం రాసి ఇచ్చారు. ఇటీవల పినతండ్రి చనిపోవడంతో వారి కుమారులు పద్మమ్మపై దాడులకు పాల్పడి ఆమె బాగానే సైతం ఆక్రమించుకున్నారు. పొలంలోకి అడుగు కూడా పెట్టనివ్వడం లేదు. ఈ విషయాన్ని స్థానిక తహశీల్దార్‌కి ఎన్నిసార్లు చెప్పిన స్పందించకపోవడంతో సోమవారం తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకొని స్పందన కార్యక్రమానికి హాజరైంది. తనకు న్యాయం చేయాలని కోరుతూ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. చుట్టుపక్కల వారు దీని గమనించి ఆమెను ఆత్మహత్య చేసుకోనివ్వకుండా కాపాడారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వాస్తవాలను తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

భూమి పద్మమ్మది అని ఆధారాలు ఏమీ లేవు : రెవెన్యూ అధికారులు
పానగల్‌కు చెందిన పద్మమ్మ పేరుపై సర్వే నెంబర్ 202/7లోనీ 1.56 ఎకరాల భూమి ఎన్.పద్మమ్మ ది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని రెవెన్యూ అధికారులు వివరించారు. 1.56 ఎకరాల భూమి మురుగేష్ మొదలి పేరుమీద అసేన్ చేయబడి ఉందని, ఆ తర్వాత వాళ్ళ వారసుల పేరు పైన బదిలీ చేసినట్లు ఎలాంటి రికార్డులు లేవు, అన్ రిజిస్టర్ పార్టిషన్ డీడ్‌పై అసైన్దారుడు వేలిముద్ర వేశారని అందువల్ల పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్లు మంజూరు చేయలేకపోయామని రెవెన్యూ అధికారులపై నిందలు వేయడం సరైనది కాదన్నారు.

శాస్త్రం.. శరణం..గచ్ఛామి

ఆకట్టుకున్న సైన్స్ మేళా
సృజనాత్మకతకు పదును పెట్టిన విద్యార్థులు
రాష్ట్రస్థాయికి పది ప్రదర్శనలు



విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని బాలురు ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ ప్రపంచం శాస్త్రసాంకేతికతపై ఆధారపడి నడుస్తోందన్నారు. గ్రామీణస్థాయి నుంచే భావి శాస్త్రవేత్తలు తయారు కావాల్సిన అవసరం చాలా ఉందన్నారు. అందుకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయి సైన్స్‌పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మకతను వెలికితీసి, వారి ప్రతిభను గురుతర బాధ్యతను గురువులు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. జిల్లాస్థాయిలో ఆకట్టుకున్న పది ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు

1) మినరల్ వాటర్ క్యాన్ క్లీనింగ్ మిషన్ (జిల్లా పరిషత్ జిల్లా పాఠశాల తడుకు ఆర్ఎస్.విద్యార్థి ప్రియాంక, గైడ్ టీచర్ గజరాజన్.
2) ఎకో ఫ్రెండ్లీ కంటైనర్ పర్ సీడ్ లింక్- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముచ్చివోలు విద్యార్థి ధర్మతేజ, గైడ్‌టీచర్ డాక్టర్ సుబ్రమణ్యం శర్మ.
3) హైజీన్ టాయిలెట్- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, రేణిగుంట విద్యార్థి యోగేంద్ర, గైడ్ టీచర్ మోహన్ బాబు.
4) షోల్డర్ పెయిన్ రెడ్యూసర్- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తడుకు ఆర్ఎస్.విద్యార్థి పార్థు వర్మ, గైడ్ టీచర్ భానుప్రసాద్.
5) స్మార్ట్ బ్లైండ్ స్టిక్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెట్టు, విద్యార్థి చక్రధర్, గైడ్ టీచర్ రవి.
6) స్మార్ట్ డస్ట్‌బిన్- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నారాయణవనం విద్యార్థి జ్యోత్స్న, గైడ్ టీచర్ శ్యామలత.
7) సిఓ2 క్యాప్చరింగ్ మిషన్- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బి.ఎన్.కండ్రిగ.విద్యార్థి పుష్కల్, గైడ్ టీచర్ గౌరి.
8) ఎఫెక్టివ్ గ్లోబల్‌వార్మి- ఎపి.టి.డబ్యు.ఆర్.ఎస్. వెంకటగిరి, విద్యార్థి భార్గవి, గైడ్ టీచర్ షకీనా.
9) క్లీనో మీటర్ విత్ లేజర్ లైట్- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెల్లూరు, విద్యార్థి హారిక, గైడ్ టీచర్ రమేష్.
10) త్రీడి హోలోగ్రామ్- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్.ఆర్.ఎస్.జి.హెచ్ విద్యార్థి గౌతమ్, గైడ్ టీచర్ లత.

ఈనెల 28వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలలో పాల్గొంటారు. ఆర్డీఓ రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్, ఉపవిద్యాశాఖాధికారి రఘురామయ్య, ఎంఇఓ భువనేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్, సైన్సు సమన్వయకర్తలు ధనుంజయ సారథి, కోదండపాణిలతో పాటు పలువురు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11న మెగా జాబ్ మేళా



జాబ్ మెగా మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి- క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ సీడప్, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట నియోజకవర్గం 11వ తేదీన శనివారం ఎస్‌విఎస్‌ఎస్‌సి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేటలో పదవ తరగతి పాస్/ఫెయిల్ నుంచి ఇంటర్ లేదా డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీలో లేదా పీజి వరకు ఉత్తీర్ణత అయిన యువతీ యువకులకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 13 బహుళ జాతీయ కంపెనీలలో దాదాపు 1000 ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడును. జాబ్ మేళాలో అర్హత సాధించిన యువతీ, యువకులకు నెలకు కనీస జీతం 10,000లు నుంచి 30,000లు వివిధ రకాల కంపెనీలలో ఉద్యోగ నియామకాలు కల్పించబడును. ఈజాబ్‌మేళాకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డ్ జిరాక్స్, 5 బయోడేటా ఫార్మ్స్, జిరాక్స్ సర్టిఫికేట్స్‌తో తప్పని సరిగా తీసుకొని రావాలని అన్నారు. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఈనెల 10వ తేదీ అని, ఆసక్తి కలిగిన యువతీ ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. జాబ్‌మేళా మరిన్ని వివరాల కోసం 9177508279, 9966601867 నెంబర్లను సంప్రదించగలరు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఎడి జ్యోతి, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్యామ్మోహన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలకు

మాస్టర్ ప్లాన్ రోడ్లతోనే పరిష్కారం



మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు ట్రాఫిక్ సమస్యలను తొలగించేందుకు మాస్టర్ ప్లాన్ రోడ్లను త్వరితగతిన పూర్తిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు పనుల పురోగతిని సోమవారం ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కొరకే మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగర పరిధిలో ఏర్పాటు చేస్తున్న 14 మాస్టర్‌ప్లాన్ రోడ్ల వల్ల ప్రజలకు, వాహన చోదకులు పూర్తిగా ఇబ్బందులు తొలుగుతాయన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఉన్న టిడిఆర్ బాండ్లు వెంటనే ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఏదైనా నగరం అభివద్ధి చెందాలంటే రోడ్ల కనెక్టివిటీ ఉంటేనే సాధ్యమన్నారు. అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, డీఈ సంజీవ కుమార్, ఏసిపి బాలసుబ్రమణ్యం, సర్వేయర్లు దేవేంద్ర, మురళీకష్ణ, ప్లానింగ్, అమెనిటీ సెక్రటరీలు ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

అధికారుల అండదండలతో
జోరుగా సాగుతున్న వైనం

ప్రజాశక్తి- బాలాయపల్లి: మండలంలోని నిండలి గ్రామ సమీపంలో అధికారులు అండదండలతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. జోరుగా ఇసుక అక్రమ వ్యాపారం జరుగుతుండటంతో ఎస్ఈబీ పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలతోనే జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని కైవల్యనది పరీవాహక ప్రాంతం నిండలి, గూడూరు రూరల్ మండలం గొల్లపల్లి గ్రామం నుంచి రాత్రిపగలు తేడా లేకుండా అక్రమ ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు.

సెబ్, పోలీసులు సాక్షిగా ఇసుక రవాణా..
మండలంలోని కైవల్య నది నుంచి అక్రమంగా టాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నా అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఇసుకాసురులు సైతం ఇసుకను ప్రైవేట్ వెంచర్లకు తరలిస్తూ లక్షల్లో అక్రమార్జన చేస్తూ వారి జేబులు నింపుకుంటున్నారు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యాజమాన్యంను రైతులు ప్రశ్నిస్తుంటే పోలీసులకు, సెబ్, మండలశాఖ అధికారులకు మామూళ్లు ఇస్తున్నాం మేము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని దాడికి దిగుతున్నారని చెబుతున్నారు. నదిలోని ఇసుకను మొత్తం ఇలా అక్రమంగా తరలిస్తే భూగర్భజలాలు ఇంకిపోయి తమకు తాగు, సాగునీరు లేక అల్లాడిల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అక్రమ ఇసుక వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఇసుక భారీగా తవ్వేయడంతో ఏర్పడిన గుంతలు

శ్రీవారి సేవలో ప్రముఖులు



ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలుగు చలనచిత్ర దర్శకుడు మలినేని గోపీచంద్ స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు

సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవోకు వినతి



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మున్సిపాలిటీ పడమర సమీపంలోని కామ్రేడ్ జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో కనీస సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని సోమవారం జరిగిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి జోగి శివకుమార్, తిరుపతి జిల్లా ఆటో సంఘం నాయకులు బి.వి.రమణయ్య, కె.వి.పి.ఎస్. నాయకులు అడపాల ప్రసాద్, కె.సురేష్, జక్కా వెంకయ్యశ్రామికనగర్ ప్రజలు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలకు రూ.5 లక్షలు మంజూరు చేయాలి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న కాలనీల్లోని ఇళ్లకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని.. నిరుపేదలకు ఇంటిస్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని సోమవారం తిరుపతిత జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో బీఎన్‌కండ్రిగ మండల నాయకులు, పేదలు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వీఎస్‌పురం గిరిజనకాలనీ, కారణిమెట్ట తరతర గ్రామాల ప్రజలతోపాటు సీపీఐ జిల్లా కార్యదర్శి కత్తి రవి, మండల సహకార కార్యదర్శి చింత రవి, కష్ణయ్య, పీటర్, చంద్రమ్మ, శీను, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి-రేణిగుంట: క్యారేజీ రిపేర్ వర్క్‌షాప్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వెస్ట్ కాలనీ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పీఆర్ఎస్ చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ దేవసహాయం, స్పోర్ట్స్ ఆఫీసర్ ఉదయ్ కిరణ్, స్పోర్ట్స్ సెక్రటరీ గుణశేఖర్ మాట్లాడారు. నిత్యం పనిఒత్తిడితో నిమగ్నమయ్యే కార్మికులు క్రీడలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, చెస్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-సత్యవేడు రూరల్: ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన విద్యారులను అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తతీయ, ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నవీన్, నివేత, ప్రసన్న అర్హత సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శామ్యూల్ అరవింద్, అధ్యాపకులు హన్నా, ఎస్.హరి ప్రసాద్, హరి ప్రసాద్, మురళీ మోహన్, ఢిల్లీ ప్రసాద్ తదితలులు పాల్గొన్నారు.

ఎస్సీలపై సచివాలయ సిబ్బంది చిన్నచూపు

ప్రజాశక్తి-బాలాయపల్లి: గొట్టికాడు సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఇరువురు సచివాలయానికి వెళ్లిన ఎస్సీలను చిన్నచూపు చూస్తున్నారని గ్రామస్థులు వాపోయారు. స్థానికంగా పనిచేస్తున్న నర్సు ఓ గిరిజన మహిళను డెలివరీ కోసం తీసుకువెళుతున్నట్లు గొట్టికాడు సచివాలయం గ్రూపులో ఓ ఫోటో పెట్టారు. దీంతో ఇంజినీరింగ్ ఆసిస్టెంట్ ఎస్సీ, ఎస్టీలు అందరూ ఇలానే ఉంటారని హేళనగా మాట్లాడారు. ఈ సమయంలో పింఛనుకు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లిన కందాటి పెంచలయ్యతోపాటు మరికొందరు అదేంటి అలా అంటున్నారని ప్రశ్నించారు. దీంతో ఓ వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేశాడు. ఎంపీడీవో వినీల్ కుమార్ ఫిర్యాదుదారుడిని సచివాలయానికి పిలిపించి విచారించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్సీలు కోరుతున్నారు. మండలంలోని గొట్టికాడు గ్రామ సచివాలయం సిబ్బంది దళితులపై చిన్నచూపు మానుకోవాలని ప్రజాసంఘాల నాయకుడు అబ్రహం అన్నారు.

సభ్యత్వం నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జన సైనికుల కుటుంబాలకు భరోసా కల్పించేలా, ప్రమాదవశాత్తు గాయపడిన వారిని ఆదుకునేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 10 నుంచి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఇప్పటివరకు సభ్యత్వం తీసుకోని వారు నూతన సభ్యత్వం తీసుకోవాలని, ఇదివరకే చేసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

రూ.5.75 కోట్లతో అభివృద్ధి పనులు



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీలో ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సోమవారం పంచాయతీలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఎంపీపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గడప గడపకు మహా పాదయాత్రను ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లిన ఎంపీపీ గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పని తీరు, సంక్షేమ పథకాల అమలు తీరుని ఆరా తీశారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ప్రజలను తెలియజేశారు. ఎంపీపీకి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మునీశ్వర్ రెడ్డి, పంచాయతీ సర్పంచ్ జోగి మోహన్, డివిజన్ పార్టీ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గజమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంపీపీ వసతులను ఆరా తీశారు. రూ.20 లక్షల నిధులతో కాలువ నిర్మాణానికి ఎంపీపీ భూమిపూజ చేశారు. నవరత్నాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలు, కులాలు, మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. పెరుమాళ్లపల్లి, కొప్పరివాండ్లపల్లి, బాలాజీనగర్, గాంధీపురం, ఇతర కాలనీలలో పర్యటించారు. సొంత గ్రామం పెరుమాళ్ళపల్లి పంచాయతీ అని పేర్కొన్నారు. మూడున్నరేళ్ల కాలంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో గ్రామంలో రూ.5.75 కోట్ల అభివద్ధి పనులు చేపట్టామన్నారు. అర్హులకు జగనన్న ఇళ్లు కేటాయించామన్నారు. మరో రూ.1.50 కోట్ల నిధులతో అభివద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పార్లపల్లి దామోదర్ రెడ్డి, హరిత, వైఎస్ఆర్ సీపీ నాయకులు బొందు భాస్కర్ రెడ్డి, గౌతమి రెడ్డి, ఉపసర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, లోకనాథం, భానుకుమర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చాట్ల రవి, రాజు, చాట్ల భాను, లోకనాథ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-నాగలాపురం: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పర్యవేక్షించాలని.. వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేవరకు నిరంతరం ప్రజల్లోనే ఉండాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. నాగలాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో అందిస్తున్నామన్నారు. మెరుగైన విద్య, వైద్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని కొన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. నవరత్నాలు, రైతు భరోసా, అమ్మఒడి, చేయూత, వాహన మిత్ర, ఆరోగ్యశ్రీ మొదలైన పథకాలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతనంగా సచివాలయం కన్వీనర్ గా నియమితులైన మోహన్ మొదలియార్‌ను జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ అపరంజిరాజు, సర్పంచ్ సుధా చిన్నదొరై, ఎంపీపీ సింధు శ్యామ్, వైస్ ఎంపీపీ కుమారి ఉదయ్ కుమార్, ఎస్ ఎం సురేష్, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానాలతో వ్యవసాయం సులభతరం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నూతన సాంకేతిక విధానాలతో వ్యవసాయం సులభతరమని.. వ్యవసాయంలో డ్రోన్‌ను ఉపయోగించి మందులు పిచికారీ చేయడంతో తక్కువ ఖర్చుతో సమయం ఆదా అవుతుందని డాక్టర్ శ్రీనివాసులు. పేర్కొన్నారు. రాస్ కషి విజ్ఞాన కేంద్రం తిరుపతి వారు పుత్తూరు మండలంలోని తొరూరు గ్రామంలో వ్యవసాయంలో డ్రోన్‌లు ఉపయోగించి పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పించి ప్రదర్శన నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి భారతీయ వ్యవసాయ పరశోధనా మండలి.. న్యూఢిల్లీ వారు వ్యవసాయ డ్రోన్‌ల వినియోగాన్ని రైతులకు చేరవేయడానికి రాస్ కషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలలో రైతుల పొలాలలో డ్రోన్ వినియోగించి ప్రదర్శన క్షేత్రాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రోన్ వినియోగించి పిచికారీకి ఎకరాకు 6 నుంచి 8 నిమిషాల సమయం పడుతుందని, కేవలం 10 లీటర్ల నీరు ఎకరాకు సరిపోవడంతోపాటు సాధారణ పద్ధతిలో వినియోగించే మందులో 75 నుంచి 80 శాతం మందు సరిపోతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య, రాముకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకుడు మురళీ, రైతులు పాల్గొన్నారు.

దోపిడీ విధానమే వైసీపీ ప్రధాన అజెండా



ప్రజాశక్తి-గూడూరు: దోపిడీ విధానమే వైసీపీ ప్రధాన అజెండా అని.. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి అన్నారు. గూడూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పాశిం సునీల్‌కుమార్ సోమవారం నుంచి చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకష్ణ, పరసారత్నం, తానంకి నానాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా వైఫల్యమైందని.. దోపిడీ విధానమే ప్రధాన అజెండాగా ఇప్పటి ప్రభుత్వం అవలంభిస్తుందని తెలిపారు. గూడూరు తీర ప్రాంతంలో విరివిగా లభించే అరుదైన సిలికాను స్వయంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి, వారి బంధువులు దర్జాగా దోచుకుంటున్నారని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ నేటి ప్రభుత్వం అభివద్ధి పనుల్లో ఒక్క అడుగు ముందుకు వేయలేదని, గత ప్రభుత్వాలు చేసినా అభివద్ధి తప్ప.. ఇప్పుడు కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. పాశం సునీల్‌కుమార్ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు అండదండలతో, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో, లోకేష్‌బాబు సూచనలతో తాను పాదయాత్ర మొదలు పెట్టానని, నిర్విరామంగా ఈ పాదయాత్ర జరుగుతుందని, గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలు సహకారంతో ముందుకు వెళ్తానని తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన కనెక్టివిటీ రోడ్లు, సిసి రోడ్లు, కల్వర్టులు నేటికీ అదే తప్ప కొత్తగా అంటూ ఈ ప్రభుత్వం ఇప్పటికీ మొదలుపెట్టలేదని, ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వమేనని.. అందరికీ డబ్బులు ఇస్తున్నామని చెప్పి ఆశ చూపి అధిక మొత్తంలో పన్నులు వసూలు చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో పాదయాత్రలో ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామని ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. నాయకులు శీలం కిరణ్ కుమార్, చెంచురామయ్య, నల్లబల్లి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, మస్తాన్ నాయుడు, సురేంద్ర, ఇజ్రాయిల్, చంద్రసుధాకర్‌రాజు, నాగభూషణం, నాగేశ్వరరావు, చక్రవర్తి, కష్ణకళ్యాణ్, మట్టం శ్రావణి, పల్లె కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో భానుప్రకాష్



ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: యువగళం పాదయాత్రలో ప్రజల ఆదరణ పెరుగుతోందని.. అన్నివర్గాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు వింటూ ముందుకు సాగుతున్నారని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. 11వ రోజు యువగళం పాదయాత్రలో భాగంగా చిత్తూరు నియోజకవర్గంలో పాల్గొన్న సందర్భంగా గాలి భానుప్రకాష్ పాల్గొని నారా లోకేష్‌తో కలిసి అడుగులేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సైతం సకాలంలో జీతాలందక అవస్థలు పడుతున్నారని తెలిపారు. వీరివెంట చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ ప్రెసిడెంట్ షణ్ముగరెడ్డి, పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, పట్టణ టీఎన్ఎస్ఎఫ్ ప్రెసిడెంట్ నవీన్, బీయస్ హరి, చిత్తూరు పార్లమెంటరీ టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మణి, నవీన్, పూర్ణ పాల్గొన్నారు.

'స్పందన'కు 112 అర్జీలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాలవ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ, డిఆర్ఓ శ్రీనివాసరావు, ఎస్‌డిసిలు కోదండ రామిరెడ్డి, భాస్కర్ నాయుడులతో కలసి జిల్లా కలెక్టర్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 112 అర్జీలు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 76, ఉపాధికి సంబంధించి 1, జిల్లా పౌరసరఫరాల శాఖకు 3, ఏడీ సర్వేకు 1, పోలీస్‌శాఖకు 8, మునిసిపల్ కమిషనర్‌కు 2, పంచాయతీరాజ్ శాఖకు 8, పిడి డ్వామాకు 3, హౌసింగ్ శాఖకు 3, పంచాయతీరాజ్ ఎస్ఈకు 1, ఏపిఎస్‌పిడిసిఎల్‌కు 4, డిటిడబ్ల్యుఓకు 1 ఫిర్యాదులు రావడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. వివిధ శాఖలకు సంబందించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజాశక్తి-నాగలాపురం: సురుటపల్లిలో కొలువైన శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు జరుగు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను సోమవారం ఆలయ ఛైర్మన్ ఏఏం బాలాజీ రెడ్డి ట్రస్ట్ బోర్డు సభ్యులు కలిసి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి- రేణిగుంట: విప్పమానుపట్టెడ గ్రామ పంచాయతీలో సోమవారం సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి అధ్యక్షతన జాతీయ కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పలు సూచనలు, సలహాలు అందించారు. సిబ్బంది యామిని, రెడ్డమ్మ, మోహిని, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం హక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి: డాక్టర్ బార్ అంబేడ్కర్ అయన మేధస్సును ఉపయోగించి రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాల వారికి ఇచ్చిన హక్కులను కాపాడుకోవాలని ప్రజాసంఘాల నాయకుడు చెన్నూరు మస్తాన్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ వివిధ రకాల సందేహాలను నివృత్తి చేసేలా రాజ్యాంగంలో పొందుపర్చారని వివరించారు. రాజ్యాంగంలోని ప్రతిఅక్షరం అందరికీ శిరోధార్యమన్నారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ ఆశయాలను సాధించడం కోసం ఉండాలని తెలిపారు.

డప్పు కళాకారులకు పింఛను మంజూరు చేయాలి



ప్రజాశక్తి-సత్యవేడు రూరల్: మదనంజేరి గ్రామంలోని అర్హత కలిగిన డప్పు కళాకారులందరికీ పింఛను మంజూరు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణాచలం డిమాండ్ చేశారు. సోమవారం మదనంజేరి గ్రామంలో కేవీపీస్ నూతన గ్రామ కమిటీ 15 మందితో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణాచలం మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలించే జగన్మోహన్‌రెడ్డికి దళితులపై ఎలాంటి ప్రేమ లేదన్నారు. దళితులకు ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదని వాపోయారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించి దళితులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే ఆదిమూలం గడపగడపకు తిరుగుతున్నా అక్కడ దళితులు అనుభవిస్తున్న కష్టాలు కనబడటం లేదన్నారు. ఇప్పటికైనా డప్పు కళాకారులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం నూతన గ్రామ కెవిపిఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రయ్య, ఉపాధ్యక్షుడుగా వీరాస్వామి, కార్యదర్శిగా తిరుముగం, ఉప కార్యదర్శిగా మురుగేష్, కోశాధికారిగా మారి, కమిటీ సభ్యులుగా ఆశీర్వాదం, కుప్పన్, మధురై, ఆర్ముగం మునినాథం, మణి, ఏలుమలై, మురుగేష్, సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంకమ్మ మృతికి నివాళులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపాలిటీలోని 17వ వార్డుకు చెందిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ అంకయ్య అక్క పెద్ద అంకమ్మ మృతిచెందారు. రాష్ట్ర మంత్రి ఆర్.కె.రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, కో ఆప్షన్ మెంబర్ చీరాలు, నాయకులు జనార్దన్ యాదవ్, సీఎం దిలీప్ మొదలి, చక్రి, వెంకటముని, బాబు, రాంబాబు, పెద్ద అంకయ్య, మునస్వామి, తదితరులు ఉన్నారు.

సింగపూర్ సంస్థతో ఎస్వీయూ ఒప్పందం



ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం లోని ఉపకులపతి కార్యాలయంలో సింగపూర్ కేంద్రంగా నడిచే "ప్లానెట్ వైస్ ప్రైవేటు లిమిటెడ్ " వారితో పరస్పర అంగీకారంతో కూడిన ఒప్పందం ఇరువురు అధికారులు సోమవారం చేసుకున్నారు. ఈ అంశంపై విసి మాట్లాడుతూ కార్బన్ రహిత పర్యావరణ కోసం "ప్రకతి సురక్ష" పేరుతో ప్రారంభమైన కార్యక్రమంలో ఎస్వీయూ భాగస్వామ్యం అవుతుందని, వ్యర్థాలు, నీరు, శక్తి వంటి వాటిని సమర్థవంతంగా వ్యర్థమై పోకుండా ఈ ఒప్పందంలో భాగంగా చేపట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇండియాలో కార్బన్ రహిత పర్యావరణాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తూ, సహజసిద్ధమైన వనరులైన నీరు , చెట్లు, గాలి వంటివి స్వచ్ఛంగా పెంపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ప్లానెట్ వైస్ కో ఫౌండర్ పి.రవితో ఒప్పందం పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య వరదరాజన్, ఆచార్య దివాకర్ రెడ్డి, ఆచార్య రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరి: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ముఖఆధారిత హాజరు ప్రతి ప్రభుత్వఉద్యోగి తప్పనిసరి నమోదు చేయాలని, రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ పూర్తికావాలని జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం అమరావతి నుండి ముఖ్యమంత్రి అడిషనల్ కార్యదర్శి ముత్యాలరాజు అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టర్, జేసి డికె.బాలాజీ, స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి వంద శాతం ముఖఆధారిత హాజరు నమోదు జరగాలని అన్నారు. చాలాచోట్ల మండల స్థాయిలో ఇన్‌ఛార్జులుగా ఉన్న కార్యాలయాల్లో ఎఫ్ఆర్ఎస్ నమోదు కాలేదని, ఇన్‌ఛార్జులుగా ఉన్న అధికారుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి సమర్పించాలని పదోన్నతి అవకాశాలు కల్పించే అవకాశం వుందని సూచించారు. జిల్లాలో చుక్కల, అనాదీనం భూముల వివరాలు సిద్దంచేయాలని, రీసర్వే పూర్తిఅయిన గ్రామాల్లో పెండింగ్ లేకుండా భుహక్కు పత్రాల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఎస్సీ కాలనీలకు శ్మశాన వాటికల గుర్తింపు, కేటాయింపు త్వరగా జరగాలని సూచించారు. మరమ్మతుల అవసరమున్న రోడ్లు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అందిన రోడ్ల వివరాల అంచనాలు పూర్తిచేసిన జాబితా త్వరగా అందించాలని ప్రభుత్వానికి పంపాలన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు పూర్తిచేయాల్సి ఉంటుందని అన్నారు. ఈసమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ శంకర నారాయణ, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్‌రెడ్డి, ఎస్‌సి సంక్షేమ మరియు సాధికార అధికారి చెన్నయ్య, ఇన్‌ఛార్జ్ ఏఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రజాశక్తి- సూళ్లూరుపేట: మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తరపున సూళ్లూరుపేట ఆర్‌డిఓకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.సాంబశివయ్య, యూనియన్ జిల్లా కార్యదర్శి గోపి మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరును రద్దు చేయాలని, సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల నుంచి గతకొన్ని నెలలకు ఈఎస్ఐ, పిఎఫ్‌ను చెల్లిస్తున్నప్పటికీ వారికి వైద్యసౌకర్యం, ప్రసూతి లీవులు ఇవ్వడం లేదన్నారు. పిఎఫ్‌లో ఉన్న వ్యత్యాసాలను సరిచేయాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ కార్యదర్శి బి.పద్మనాభయ్య, నాయకులు రామయ్య, పళని, చంగయ్య, రమణయ్య, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనలు



ప్రజాశక్తి- తిరుచానూరు: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించి, అర్జీదారులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ, డిఆర్ఓ శ్రీనివాసరావు జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జగనన్న ఇళ్లకు రూ.5లక్షలు నిర్మాణ వ్యయం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ డిమాండ్ చేశారు. ఈ నిరసనలు ఉధతం కావడంలో డిప్యూటీకలెక్టర్ భాస్కర్ ధర్నా శిబిరానికి చేరుకుని అర్జీలను స్వీకరించి ధర్నాను విరమింపజేశారు.

డీఈఐసీ సిబ్బందికి రాష్ట్రసాయి శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాష్ట్రంలోని డిఈఐసి సిబ్బందికి ప్రభుత్వ శిక్షకులచే సోమవారం శిక్షణ ప్రారంభించారు. ఈనెల 10వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖల అదనపు కమిషనర్ డాక్టర్ సుమితా ఘోష్, (వర్చువల్), జై నివాస్ ఎన్‌హెచ్‌ఎం ఎండి డాక్టర్ ఎంకేసి నాయర్, తిరుపతి డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరిరావు, స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ డాక్టరు దీప్తి కన్నా, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు, పీడియాట్రిక్స్ విభాగం నుంచి డాక్టరు హరినాథ్, డాక్టర్ కిరీటి పాల్గొన్నారు.